
పవిత్రతత పరదాల్లో దాక్కున్న గృహిణుల్లో కొంతమంది విషసర్పాలకన్నా క్రూరులు. వారి కాటుకి మందు లేదు.



# పతివ్రతల్లారా వర్ధిల్లండి!

కె. వి. కృష్ణకుమారి

అది నాలుగిళ్ళ సావిడి.

పనీ పాటా లేని విషప్పురుగుల కనువైన లోగిలి.

పాతివ్రత్యపు పరదాలో బ్రతుకుతున్న పతివ్రతా శిఖామణుల కమరిన రచ్చబండ లాంటిదది.

ఉన్న ఆస్తిని నాశనం చేసుకుని కోర్కెల్ని అదుపులో పెట్టుకోలేక- చవకబారు పుస్తకాల్ని- వంటపట్టించుకుని రాత్రయే



ముగ్గుల్లో గొబ్బిళ్ళు

చిత్రం : కోరా శ్రీనివాసరావు, ఎడ్లపల్లి

సరికి పచ్చి బోగందానికన్నా హీనంగా తయారై భర్తని రేప్ చెయ్యటానికి కూడా సిద్ధపడే అనసూయ వర్సగా ఏడుగుర్ని కన్నా- సాయంత్రం అయే సరికి వర యూరు చీరె నిండుగా కప్పుకుని రాత్రి గురించి, జల్సా పురుషుడైన భర్త గురించి తియ్యగా ఆలోచించుకుంటూనే-

పెద్ద కుంకం బొట్టుతో రూపాయిసైజులో వున్న మంగళ సూత్రపు బిళ్ళల్ని చీటికీ మాటికీ చూసుకుంటూ, సావిడిలోకి చేరుకుంటుంది.

సీతమ్మ,-

మొగుడొక ధర్మరాజు. ఎల్. డి. సీ.గా ఎన్నోఏళ్ళ నుంచీ ఆ సంసారాన్ని ఈదుకొస్తున్నాడు.

చర్మపు తొడుగులాంటి శరీరంతో- నలభై ఏళ్ళకే జవసత్వాలుడిగిపోయినా - పగలంతా కుటుంబం కొసం-కండల్ని కరిగిస్తున్నాడు- రాత్రంతా భార్యని తృప్తి పర్చటంకోసం అలిసిపోతున్నాడు.

అలసిపోయాడు.

ఇప్పుడు జీతాన్ని ఇవ్వటానికి తప్ప- మగవాడంటూ ఒకడు రక్షణగా ఇంట్లో తోడున్నాడనుకోటానికి తప్ప పిల్లలకి కాపలాగా, రోగాలకీ, రొచ్చులకీ హడావుడిగా హాస్పిటల్‌కి పరుగెత్తటానికి తప్ప ఇప్పుడా ఎముకలగూడు దేనికీ పనికిరాదు.

అందుకే సీతమ్మ విపరీతమైన అసంతృప్తిని పెంచుకుంది. భర్త ఉనికినే పట్టించుకోటం మానేసింది, ఉడికినా ఉడక్కపోయినా పెట్టినా పెట్టకపోయినా నాలుగు మెతుకులు తిని ఆఫీసుకి వెళ్ళటానికి అలవాటుపడ్డాడతను.

సాయంత్రం వచ్చినా సీతమ్మ తన కోసం కప్పు కాఫీతో తయారుగా వుండదని తెలుసు. కన్న పాపానికి కన్నపిల్లలు వరండాలో కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని ఈ ఒక్క ప్రాణం కోసం ఎదురు చూస్తు వుంటారని తెలుసు.

అందుకనే ఆఫీస్ కట్టెయ్యగానే కరక్టుగా ఇంటిముందు వాల్తాడు. చంటివాడ్ని గుండెలుమీద పడేసుకుని నిర్లిప్తంగా పడుకుండిపోతాడు.

చర్చాలు ముగించుకుని ఏ ఎనిమిది గంటలకో సీతమ్మ తీరిగ్గా ఇంటికి జేరుకుంటుంది. వోపికుంటే ఊరల్లాంటివి చేస్తుంది. లేదంటే పచ్చడి మెతుకుల్తో పని పూర్తి చేస్తుంది-

పనంటూ చేస్తున్నంత సేపూ భర్త అసమర్థతని ఏదో రూపంలో కడుగుతూనే వుంటుంది -

గిన్నెల శబ్దంతో వంటిల్లు ప్రతిధ్వనిస్తూనే వుంటుంది. పడగ్గది కొచ్చేదాకా చెవులు హోరెత్తిస్తున్నా-పల్లెత్తు మాటనకుండా నీరసంగా పడుకునే వుంటాడా మహానుభావుడు -

తను నోరు మెదిపితే ఆ నోరు తారస్థాయిని చేరుకుంటుంది. తను కాపాడుకొస్తున్న ఇంటిగుట్టు బట్టబయలౌతుంది.

భార్య కప్పుకున్న పాతివ్రత్యపు తెర మంచులా కరిగిపోతుంది, దానివల్ల లాభం?

అందుకనే అలవాటుగా చీకట్లో దగ్గర కొస్తున్న భార్యకి లొంగిపోతూ వుంటాడు, అలవాటుగా.

ఆ లోగిలిలో ముఖ్య సభ్యురాలు అరుంధతి.

వయసు పాతిక దాటకపోయినా అనుభవాల వయసును చెప్పటం కష్టం.

అవసరాలు తీర్చుకోలేని గుమాస్తా కూతురుగా పుట్టినా, అవసరాలు తీర్చటానికి పక్కింటి కాలేజీ స్టూడెంట్సు రెడీమేడ్‌గా దొరికేవారు- బజారు సాంగత్యాన్ని వంట బట్టించుకున్న అరుంధతికి ఈ విధంగా అవసరాలు తీర్చుకోటం బ్రహ్మ విద్యేం కాదు.లోకం కన్ను కప్పటానికి కాళ్ళుపడ్డ తండ్రి నానా తిప్పలూ పడి, అడ్డమైన గడ్డి కరిచి అరుంధతినొకింటిదాన్ని చేసి పరువు బజార్నపడకుండా తను వొడ్డున పడ్డాడు. ఎందరినో రుచి చూసిన అరుంధతి కడుపులో ఎవరి బీజమో ప్రాణం పోసుకుంటున్నా అమాయకుడైన భర్త గుండెల్లో స్వచ్ఛమైన గృహిణీలా మైకంలో వొరిగిపోతుంది. పాతివ్రత్యమే జన్మహక్కులా సూత్రాల్ని కళ్ళకద్దుకుంటుంది.

అవసరమైతే అందర్లో.

పవిత్రత నూరుపాళ్ళు కన్పించాలన్న ఆరాటంతో పావలాసైజు కుంకుమను పాపిట్లోకూడా పెట్టుకుని మంగళప్రదమైన మట్టి గాజుల్ని గలగల లాడించుకుంటూ ముక్కుకున్న బేసరిని గిరగిరా తిప్పుతూ మట్టెలు నేలకు కొట్టుకుంటూ సమావేశాల్లో ముఖ్యస్థానం అధిష్టిస్తూ వయసు చిన్నదైనా, గుణం గొప్పదనీ, దాంపత్యంలోని పవిత్రత తన దగ్గరే నేర్చుకోవాలనీ-కన్యాత్వాన్ని కాపాడుకోటం, తనలాంటి నిగ్రహస్తుల చేతుల్లో చేతల్లో వుందనీ- సమా


# రేడియో మెకానిజం

ట్రాన్సిస్టర్లు, ఏ. సి మరియు ఏ. సి/డి. సి సమస్త రేడియోల థీరీ, అస్సెంబ్లింగ్ ఇంకా రిపేరింగ్. ఎవరైనను ఇంటివద్దే నేర్చుకునే ఏర్పాటుతో అనేక రేఖాచిత్రములు, వైరింగు బొమ్మలుగల పూర్తి కోర్సు తెలుగు పుస్తకాలు, అనుబంధ నోట్సు కలపు. మా పుస్తకములు అనతికాలములోనే పలువురి మన్ననలు పొంది నాల్గవ ముద్రణలో వెలువడినవి. మిగతా వివరములకు:

సుభాష్ రేడియో హౌస్, నకిరేకల్లు-508 211, నల్లగొండ జిల్లా.

వేశాన్ని రక్తి కట్టించడం అందరికన్నా ముందుగా భర్త సేవలకోసం ఇంటికి వెళ్ళటం అరుంధతి అలవాటు.

ఇక దమయంతి—

పూజా పునస్కారాలమీద, మడి, ఆచారాలమీదా మొక్కుబళ్ళు వ్రతాల మీద, పతివ్రతల కథలమీదా విపరీతమైన మోజు కనపరచే పరమ పవిత్రురాలు. ఊరు తెల్లవారక ముందే మడి చీర తడి ఆరిపోతుంది. పచ్చటి పసుపుతో — ఎర్రని కుంకుమతో కంటి నిండుగా కాటుకతో. పట్టంచు జరీ చీరెతో — నీళ్ళు కారుతున్న తలముడితో— సాక్షాత్తు — అమ్మవారిలా చెయ్యెత్తి నమస్కరించాలన్పించేటట్టుండే దమయంతి. తన పుణ్యంకొద్దీ దొరికిందని వందసార్లు అనుకుంటూనే 'గుటకలు మ్రింగుతూ కాఫీ తాగుతూ వుంటాడు భర్త.

తులసి చెట్టుకు ప్రదక్షిణ చేస్తున్నా పక్కింటి రామాన్ని సూటిగా చూడటానికి ఏ అడ్డంకులూ లేవు దమయంతికి. భర్త కోసం వచ్చేవారితో అనవసరంగా గంటలు గడిపినా అసభ్య సంభాషణలో పాలు పంచుకున్నా అదేమని నిలదీసి అడగలేడు భర్త. ఎందుకంటే అందరికీ కావల్సిన పతివ్రతా లక్షణాలన్నీ వున్నాయి భార్యలో. తను కట్టిన పసుపుతాడు ఆవిడ పవిత్రతని కాపాడుతుందని — అతని పిచ్చినమ్మకం — సమాజం దృష్టిలో లైసెన్సుంది. 'బంధువుల దృష్టిలో పవిత్రంగా పుట్టిన పిల్లలున్నారు — అందుకనే — మడికట్టుకుని గుళ్ళకి వెళ్ళినా — వేళాపాళా లేకుండా — ఊరిమీద తిరిగినా — అదేమని అడిగే లైసెన్స్ ఎవరికీ లేదు — ఎందుకంటే దమయంతి ఇల్లాలు —

ఇక మిగిలింది సావిత్రి—

ఇల్లూ సంసారం ఎప్పుడూ పట్టవు. మొగుడు — బైటకు వెళ్ళగానే — పిల్లల్ని గాలికీ — బాధ్యతల్ని ధూళికీ వదిలి — సావిత్రోని సమావేశాల్లో అతి ముఖ్య పాత్ర వహిస్తూ వుంటుంది. అందరి సంసార విషయాలనూ సానుభూతితో కనుక్కుంటుంది. ఊళ్ళో పేరు ప్రతిష్టలున్నవారి చుట్టూ నిప్పు లేకుండానే పొగపుట్టించటంలో అందర్నీ ఉక్కిరి బిక్కిరి చెయ్యటంలో ఆవిడ ఉద్దండురాలు. ఆవిడ కన్ను పడితే పచ్చని చెట్టైనా క్షణంలో మాడిపోతుంది. పచ్చని సంసారం క్షణంలో రెండుగా చీలిపోతుంది. తనకులేని సుఖం మరెవ్వరికీ దక్కనియ్యదు. దక్కితే భరించలేదు. అందుకే ఊళ్ళో విషయాలు సేకరించి అమాయకుల్ని ఉప్పుచేపల్లా ఎండబెడుతుంది. మంచివాళ్ళని పైకి లేవనివ్వకుండా నడుములు విరగ్గొడుతుంది.

అన్యోన్యంగా వున్నవారి మధ్య పచ్చగడ్డి వేసి — క్షణాలమీద నిప్పు పుట్టిస్తుంది. అన్యోన్యత లేని వారి మధ్యన అగాధాలు త్రవ్వుతుంది.

అందుకే ఆవిడ భర్త — చెప్పకుండా ఇంట్లోంచి వెళ్ళిపోయే ప్రయత్నాల మీదున్నాడు —

ఆ రోజు ఎప్పట్లా ఆ లోగిలి కళకళలాడుతోంది. సీతా, అనసూయ, అరుంధతీ, దమయంతీ, సావిత్రీ మాటలద్వారా ఊరిమీదపడి కొన్ని గంటలు కావస్తూంది. అలసిపోయిన ఐదుగురూ కాలక్షేపం బటానీలు నముల్తూ యధాలాపంగా వీధివైపు చూశారు.

అందరికళ్ళూ ఒక్కసారిగా వికసించాయి.

టిఫిన్ బాక్స్, చిన్న హేండ్‌బ్యాగ్ పట్టుకుని నీర్సంగా వస్తూంది రాధ.

వయసు ముప్ఫై సమీపిస్తున్నా ఇరవై ఏళ్ళ నునుపుదనం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

బాధ్యతలు బరువుగా కృంగదీస్తున్నా నిబ్రదొక్కుకునే ఠీవితో నడచి వస్తోంది.

పడగ పట్టిన సమాజం నీడన కన్నీటితో గుండె మంటల నార్పుకుంటూ.

పగబట్టిన బంధుకోటికి సవాల్‌గా తన కుటుంబాన్ని పోషించుకుంటోంది.

పెద్ద కూతురికి పెద్దగా కాకపోయినా — స్థితికి మించిన చదువు చెప్పించాడు తండ్రి.

స్థితి పూర్తిగా చితికిపోయే సమయానికి గంపెడు పిల్లల్నీ, పక్షవాతపు జబ్బునీ, రోగిష్టి పెళ్ళాన్నీ ఇరవైయ్యో ఏట అడుగుపెడుతున్న రాధ చేతిలో నిశ్చింతగా పెట్టాడు —

ఇన్నాళ్ళూ తమని పోషించి — తనని కాళ్ళమీద నిలబెట్టి — సంసారం కోసం — రక్తాన్ని ధారపోసి. ఈ రోజు ఏ ఆధారమూ లేకుండా మంచంపట్టిన తండ్రిని చూసింది.

తనదంటూ మిగుల్చుకోకుండా — సర్వాన్నీ — పిల్లలకూ భర్తకూ ధారపోసి పరువును గుప్పిట్లో పెట్టుకుని కాపాడిన తల్లి ఈ రోజు అదే పరువు నిలువ నీడ లేక బజారున పడుతుందేమోనని కుమిలిపోవటం చూసింది.

రెక్కలు విరిగిన పక్షులూ — రెక్కలు రాని పక్షులూ దీనంగా చూసే చూపులను చెల్లెళ్ళూ, తమ్ముళ్ళల్లో చూసుకుంది. తనను కాళ్ళమీద నిలబెట్టిన తండ్రికాళ్ళు చచ్చుపడిపోయాయి. తను నిలబెట్టాల్సిన పరువు మొదటి బాధ్యతగా అన్పించింది. అందుకే ప్రకృతి సహజమైన కోరికలకె అతీతంగా వుండిపోయింది. బాధ్యతను

ఎమెస్కో ప్రచురణా కార్య
క్రమంలో మరొక మైలురాయి!

భారత ప్రధాని
ఇందిరాగాంధీ
ప్రసంగాలు — వ్యాసాలు



అడుగడుగునా ఆమె వ్యక్తిత్వపు
శోభను, విశిష్ట మానవతను
వెల్లడిస్తూ, గత దశాబ్ది*
భారత దేశపు ఉజ్జ్వల చరిత్రకు
దర్పణం పట్టి ఏర్చి కూర్చిన సంకలనం

తెలుగు సేత
మాలతీ చందూర్
యన్. ఆర్. చందూర్

ప్రచురణ తేదీ 26-1-77 — వెల రూ. 11-50

ప్రచురణకు ముందు కొనుగోలు
సదుపాయం

ప్రచురణకు ముందు వెల రూ. 10/-
(పోస్టేజితో సహా)

అంటే ప్రచురణకుముందు, 26-1-77 తేదీ లోపుగా, అడ్వాన్సుగా రూ. 10-కట్టి మీ ఆర్డరు, మీ దగ్గరలో ఉన్న పుస్తక విక్రేతకు గాని, మాకు గాని పంపండి.

(అప్పుడే మీరు ప్రచురణకు ముందు కొనుగోలు సదుపాయం పొందగలుగుతారు. లేకపోతే పూర్తివెల రూ. 11-50, పోస్టేజీ ఛార్జి చెల్లించవలసి వస్తుంది.)

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
రాష్ట్రపతి రోడ్, సికిందరాబాదు

మించిన సుఖం, కర్తవ్యాన్ని మించిన ఆనందం లేదనుకుంది.

ఇల్లు నిల్చింది. గౌరవం మేలి ముసుగులో ఈ నాడు తన కుటుంబం నిశ్చింతగా నిద్రపోతోంది.

ఏదో ఆలోచనలో ఉన్న రాధకి ఎదురు దెబ్బ బలంగా తగిలింది. తల వంచి చితికిన బొటనవ్రేలు చూసుకుంటూ క్రింది పెదవి కొరుక్కుంటూ,

చివ్వున తలెత్తి చూసింది.

ఐదు జతల కళ్ళు తననే చూస్తున్నాయి. తనవంకే చూస్తున్నాయి. చావబోతున్న శరీరాన్ని పీక్కుతినటానికి సిద్ధంగావున్న రాబందుల్లా,

కప్పుకున్న పరువును నిలువునా చీల్చెయ్యటానికి సిద్ధంగావున్న చురకత్తుల్లా –

మెత్తని కత్తితో గొంతుకలు కొయ్యటానికి ఆరని అసూయతో ఎదుటి మనిషిని మసి చెయ్యటానికి సిద్ధంగా దేనికైనా సిద్ధంగావున్న కొలువు తీర్చిన విషపు బొమ్మల్ని చూడగానే రాధ బాధ రెట్టింపైంది.

కాలిబాధ మరుగున పడింది.

దమయంతిని మోచేత్తో పొడిచింది అరుంధతి.

"చూశావా దాని వాలకం. కుటుంబం కోసం పెద్ద త్యాగం చేస్తున్నట్టు "అంతులేని కథ"హీరోయిన్లా పెద్ద పోజూ అదీనూ. ఇదివరకంత పట్టించుకునే దాన్ని కాదు కానీ, ఈమధ్యనే దీని చరిత్ర తెల్సాకే, అసలు ఆడ పుటకంటేనే అసహ్యం పుడుతోంది."

పదహారణాల పాతివ్రత్యంతో మొహం చిట్లించిన అరుంధతిని ఆపేక్షగా చూసింది దమయంతి.

"నీకిప్పుడా తెల్సింది? నాకైతే ఎప్పుడో తెల్సు. ఎందుకంటే పెళ్ళి కావల్సిన పిల్ల గుట్టుమట్టులు బజార్న పెట్టడం మంచిది కాదు........"

## క్రాంతిపథం

తెలుగువాడా! చెలిమిరేడా!
ఎక్కడున్నా దిక్కులన్నీ
పిక్కటిల్లగ పిలువవోయ్ ॥తె॥

దిగంతంబులు మారుమ్రోగ
అగాధంబులు పూడిపోగ
ఐక్యతే మన మంత్రమనుమా
సఖ్యతతో విఖ్యాతి గనుమా ॥తె॥

తెలుగు దేశపు వెలుగు జిలుగు
తెలుగు కాంతుల దివ్యశోభ
తళతళామని మెరపు మెరయ
తెలియజేయర దశలు దిశల ॥తె॥

ప్రళయభీకర పెనుతుఫానులు
పాడిపంటల పాడుజేయగ
బిక్కుబిక్కని పారజూడక
చెక్కుచెదరక నిలచి పిలచిన ॥తె॥

శాంతిదూతగ శక్తియుక్తితో
క్రాంతిపథమున ముందుకడుగెయ్
సంక్రాంతి పిలుపుకు శంఖమూది
సాగిపో సయ్యాటలాడుచు ॥తె॥

—కోగంటి గోపాలక్రిష్ణయ్య

మంచితనమంతా గొంతు కడ్డంపడ్డట్టు అసహ్యమంతా గుండెల్లో పేరుకున్నట్టూ, అదోలా మొహం పెట్టి, వస్తున్న రాధని ఓరగా చూసింది సావిత్రి.

"ఐతే నేనేనన్న మాట గుట్టును గుండెల్లో దాచుకుంది...." ఆత్రుతగా గాలి పీల్చింది సీత.

అందరి కళ్ళు ఆశ్చర్యంగా ప్రశ్నార్థకంగా, ఓ కళ్ళలోకి మరో కళ్ళు తరచినట్టు చూసుకున్నారు.

త్వరత్వరగా వస్తున్న రాధ ఎవరో పలకరించడంతో ఆగిపోయింది.

"చూశావా నడిబజార్లో వాడితో ఎలా మాట్లాడుతూందో.... ఇలా మన సంసారులం చెయ్యగలమా? ఛస్తే చెయ్యలేం.... అరుంధతి గొంతులో అసూయ బుసకొట్టింది.

"ఇంతకీ ఎవడు వాడు?"

కుతూహలంతో దగ్గరకు జరిగింది సావిత్రి.

అజ్ఞానిని చూసినట్టు చూసింది అరుంధతి.

"ఇందాకేదో పెద్ద తెల్సినావే...."

గొంతు తగ్గించి దిక్కులు చూసింది.

"నారాయణరావని.... వాళ్ళింటి ఎదురాయన – పెళ్ళాంతో వాడికంత ఇది లేదులే, ఎప్పుడూ ఇలాంటి బజారు వాళ్ళకోసమే ఎదురు చూస్తుంటాడు. పాపం పెళ్ళాం ప్రతివ్రతనుకో. ఈ రాధ ఎట్లా వల్లో వేసుకుందో వేసుకుంది. ఎప్పుడూ వీడు వాళ్ళింట్లోనూ వాళ్ళు వీడింట్లోనూ పడి ఏడుస్తూ వుంటారు. ఉప్పు కారాలు తినే మనిషా మరి. రాధ లాంటి బరి తెగించింది మీద పడ్తుంటే ఎవరు మటుకేం చేస్తారు? వాడి పెళ్ళాం, పిల్లల పని కుక్కలు చింపిన విస్తర్లా బజారుపాలే చూస్తూ వుండండి.." ఆరిందాలా చెపుతున్న అరుంధతిని రెప్పవాల్చకుండా చూశారందరూ.

"సరిపోయింది. నీకు తెల్సింది ఇదొక్కటే నన్నమాట.... ఈ ముసలి పీనుగ నారాయణరావు వీడుసరే.... దీని ఆఫీసర్లేడూ సుధాకరని.... మావారి ఫ్రెండులే.... వాడ్ని బుట్టలో వేసుకుందిట. పొద్దస్తమానం కార్లో తిరుగుతూనే వుంటారుట. వీళ్ళింటికి రెండు మూడుసార్లు వచ్చాట్ట కూడానూ. ఇంకదీనికి ఉద్యోగం ఎందుకూ? ఎలాగూ బజార్న పడింది........అందుకే చూశావ్ వాళ్ళింట్లో ఆడపిల్లలంతా ఎంత నిగారింపుతో వుంటారో మనవాళ్ళు వున్నారు నక్క నారాయణల్లా ఎండిపోయి....

'అందరూ అనుకోటం.... ఇంటిల్లపాదినీ కంపెనీలో పెడుతుందని...."

చేతులు తిప్పుతున్న రాధని అందరూ గొంగళిపురుగును చూసినట్టు చూశారు.

"ఇంతవరకూ పెట్టలేదంటావా.... పెట్టే వుంటుంది.... దాని చెల్లెళ్ళ స్టైల్ చూశావా ఈ మధ్య...." సాలోచనగా అంది అరుంధతి.

"ఆ మధ్య ఎవరో పెద్ద ఆఫీసర్‌తో రాధ పెళ్ళనుకున్నారు.... కట్నం లేదు. ఇంటిల్లపాదిని.... ఆదుకుంటానన్నాడుట.. ఏమైందది? –"

కుతూహలంగా అడుగుతున్న సీతని నిర్లక్ష్యంగా చూసింది అరుంధతి.

మహాజ్ఞానిలా నవ్వి దగ్గరకు వచ్చింది సావిత్రి.

"ఆసంగతి నన్నడుగు.. నువ్వు చెప్పిన మాట నిజమే – ఆ ఆఫీసర్ – అన్నిటినీ ఒప్పుకుని – రాధని చేసుకుంటానన్న మాట నిజమే...."

"మరి???"

అందరి కళ్ళల్లోకీ గర్వంగా చూసి నవ్వింది సావిత్రి.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.

వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండా రండి.

డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

"ఈపాటికి పెళ్ళి అయిపోయేది కూడా" సాలోచనగా అంది సావిత్రి.

"కానీ అతనెవరో కాదు— మా వారికి చాలా దగ్గర స్నేహితుడికి స్నేహితుడు. అంత పెద్ద ఆఫీసరైనా పాపం గర్వమనేదే వుండదు. శనాదివారాలు వచ్చాయంటే, మా ఇంట్లో వుండాల్సిందే, నా చేతివంట తినాల్సిందే. అటువంటి వాడికి చూస్తూ చూస్తూ అన్యాయం ఎలా చెయ్యగలం?"

తృప్తిగా ఊపిరి పీల్చింది సావిత్రి.

"అందుకనే రాధ గురించి గుట్టుమట్టులన్నీ చెప్పేశా....ఇటువంటి బజారు సరుకు మీద మోజు మంచిది కాదని చెప్పా.... బజార్ని అలవాటుపడ్డ కుక్కని తాడుపెట్టి కట్టేసినా తెంచుకుపోక ఇంట్లో వుంటుందా....? అంతగా మోజుంటే.... అంత అందరానిదేం కాదని చెప్పా....!"

అందరి మొహాల్లో ఆనందం కొట్టొచ్చినట్లు కన్పించింది. ఏనాడూ ఎరుగని తృప్తి- వాళ్ళందరి కళ్ళల్లోనూ మెరిసింది-

"ఐతే ఆ పెళ్ళి తప్పిపోయినట్టే అంటావ్....!"

అనుమానంగా అడుగుతున్న దమయంతిని అహం దెబ్బతిన్నట్టు చూసింది సావిత్రి –

"మరి....??? ఈ పెళ్ళేకాదు.... ఏ పెళ్ళి మటుకు దానికెలా అవుతుంది? ఆ అవసరం దానికుంటుందిటె పిచ్చిదానా?"

సర్వజ్ఞురాలిగా అంటున్న సావిత్రి వంక ఆరాధనతో చూసి మంగళ సూత్రాలు తడుముకుంది అరుంధతి.


"అవున్లే ఇల్లాలవాలనుకోగానే సరా.... దానికోసం ఎంత పెట్టి పుట్టాలి....???

మంగళసూత్రాలు కన్పించేటట్లు జారవిడుచుకుంటూ పమిట సర్దుకుంటున్న అరుంధతితోబాటు అందరూ రాధవంక చూశారు.

"దీనికింత బాధపడద్దు బాబాయ్.... ఈ సంబంధం పోతే మరో సంబంధం నువ్వు పిన్ని వుండగా మాకు దిక్కులేరని ఎలా అనుకుంటాం...."

రాధ నిబ్బరం చూసి నారాయణరావు కళ్ళు చెమర్చాయి. "నిన్నింతగా చేసుకుంటానన్న ఆయన తీరా చివరికొచ్చేసరికి ఇష్టం లేదన్నాడే అదేనమ్మా మా అందరి బాధ. నీ కష్టాలు గట్టెక్కుతాయని నేనూ- మీ పిన్నీ ఎంతో అనుకున్నాం."

"ఇంక అతన్ని అడగద్దు బాబాయ్.... నా సుఖంకన్నా నన్ను నమ్ముకున్నవాళ్ళ సుఖమే నాకు ముఖ్యం. వాళ్ళ పరువే నాకు ముఖ్యం....అందు కడ్డొచ్చే ఏ సుఖం నాకొద్దు బాబాయ్...."




సంక్రాంతి ముగ్గు

రాధ కంటనీరుచూసి చలించిపోయాడు నారాయణరావు.

"పోన్లే కానీ బాబాయ్........క్రొత్తగా వచ్చాడు మా ఆఫీసర్లేడూ సుధాకర్. అతను మా పిన్ని కొడుకే అవుతాడు. అతన్తో మీ రామూని గురించి చెప్పాను. ఉద్యోగం తప్పకుండా ఇప్పిస్తా నన్నాడు. ఇవాళ శనివారం కదూ, ఇంటి కొస్తాడనుకుంటా నువ్వు రారాదూ మాట్లాడచ్చు అంది....."

తన కష్టాలను మరచి- ఎదుటివారికోసం తాపత్రయపడే రాధ.

అడుగు పడితే కాటు వెయ్యటానికి సిద్ధంగా వున్న సమాజంలోని పవిత్ర శీలాన్ని కాపాడుకుంటూ. పరువును గుప్పెట్లో పెట్టుకున్న రాధ.

అందరి సుఖాన్నీ మించిన సుఖం తనకి వేరే లేదని నిస్వార్థంగా నమ్మిన రాధ.

ఎప్పటిలాగే నారాయణరావు కళ్ళకి .. మానవాతీతంగా - పవిత్రంగా - వెలుగునిచ్చే కొవ్వొత్తిలా కన్పించి........ కరిగిపోయాడు నారాయణరావు –

"....వస్తావా బాబాయ్...."

రాధని మౌనంగా అనుసరించాడు నారాయణరావు –

దీన్దుంపతెగా.... చూశావుగా.... ఈ ముసలాడ్ని ఏకంగా ఇంటికే తీసుకువెడుతోంది...."

"బరితెగించిన సరుకు మరి...."

"పెళ్ళీ పెటాకులు లేకపోతే ఇంతేమరి మీదపడితే ఏ మగాడైనా....ఏం చేస్తాడు."

"ముసలాడో.... ముతకాడో.... గంతకు తగ్గ బొంత...."

"వీడితో అయింది.... ఇవాల్టికందరూ లేకపోతే.... ఆ సంసారం...."

రాధ దగ్గరకు రావటంతో ఆ నోళ్ళన్నీ మూతపడి వెకిలినవ్వులు నవ్వాయి,

వాళ్ళ కళ్ళల్లోని విషం, గుండెల్లోని అసూయ. ఏనాడో రాధ భవిష్యత్‌ని నాశనం చేశాయి.

నడిసముద్రంలో దొరికిన గడ్డిపోచలా నారాయణరావుతో వెడుతున్న రాధ- అప్రయత్నంగా వెనుకకు తిరిగింది.

నీడపట్టునవున్న అందరికళ్ళూ ఇంకా విషం కక్కుతూనే వున్నాయి. పవిత్రత పరదాలో దాక్కున్న వాళ్ళ గృహిణీత్వం హేళనగా నవ్వుతూనే వుంది.

మాంగల్యం చాటున దాగిన అపవిత్రతని కన్పించనివ్వకుండా సూత్రాలు అడ్డంగా గర్వంగా నవ్వుతున్నాయి. మరో రాధ కోసమన్నట్టు చివ్వున తల తిప్పిన వాళ్ళను గమనించిన రాధ కాలికి మంచిరాయి బలంగా కొట్టుకుని ముందుకు పడబోయి, నిలద్రొక్కుకుంది. ★